


# అన్యాయం

— రాజకుమారి

"నా మాట విను రాజ్యం. మార్టేరు సత్యానికి ఆ పొలం అమ్మేదాం" — ఆశ చావక మళ్ళీ అడిగాను. ఈసారి రాజ్యం కస్సుమని లేచింది. "మీ పొలం ఏదైనా ఉంటే అమ్ముకోండి. నాకేం? అది నా పుట్టింటివాళ్ళిచ్చింది. నేను అమ్మనంటే అమ్మను" అంది ఖచ్చితంగా. అటు తిరిగి పడుకున్న రాజ్యాన్ని చూస్తూ ఉండిపోయాను.

"అయినా మీ పిచ్చికానీ ఆయన మీకు డబ్బు ఇచ్చిన విషయం ఎవరికీ తెలియదు కదా. పోనీ ఆ పిల్ల అయినా ఈ డబ్బు కోసమే చూస్తూందా ఏమిటి? ఈ మధ్య ఎవడో వచ్చిపోతూనే ఉన్నాడట!! ఎవడినో ఒకడిని కట్టుకొని పోతుందిలెండి" అంది మరలా.

నిజానికి రమ్య అటువంటిది కాదు. కానీ అప్పుడప్పుడూ తనూ విన్నాడు ఇటువంటి పుకార్లు. కానీ నమ్మబుద్ధి కావడం లేదు.

సుబ్బారాయుడూ, నేనూ చిన్ననాటి స్నేహితులం. ఒకే ఊళ్ళో ఉద్యోగం అవడం వల్ల మా స్నేహం ఇంకా బలపడింది. రిటైరు అయేనాటికి



రాజమండ్రి జేసీ రెడ్స్ వారి పోటీలో కన్సొలేషన్ రూ 50/- బహుమతి పొందిన చిత్రలేఖనం

సుబ్బారాయుడికి ఊరు నిండా అప్పులు, ఒక డాక్టరు చదివిన కొడుకూ, ఇద్దరు పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలూ మిగిలారు. స్వంత ఇల్లు ఉంది కాబట్టి ఆ వచ్చిన డబ్బులతో అప్పులన్నీ తీర్చి, మిగిలినది బ్యాంకులో వేసి, వచ్చే పెన్షన్ డబ్బులతో నెట్టుకొస్తున్నాడు. అసలు ఆ అప్పులన్నీ కొడుకు చదువుకు, తనకు దక్కకుండా పోయిన భార్య జబ్బుకు అయినవే అని చెప్పేవాడు. ఏమయితే నేం-ఉద్ధరిస్తాడనుకొన్న కొడుకు మాత్రం మరో డాక్టరమ్మను ప్రేమించి, పెళ్ళి చేసుకొని పరాయి దేశం పోయాడు. సుబ్బారాయుడు - మెతక మనిషి, మంచి మనిషి కూడా. అసలు ఆ మంచితనం వల్లనే ఇపుడిలా జరిగింది.

నాకు ఇంకా రెండు సంవత్సరాల సర్వీసు ఉంది. పిల్ల పెళ్ళి చేశాను. పెద్దవాడూ స్థిరపడ్డాడు ఉద్యోగంలో - పెళ్ళీ అయింది. కానీ చిక్కు అంతా ఈ చిన్నవాడితోనే. "చిన్న చిన్న ఉద్యోగాలు చెయ్యనూ" అంటూనే ఎమ్.ఎస్‌సి. ఫస్ట్ క్లాసులో పాసయాడు. "ముప్పయి వేలు కావాలన్నాడు ఉన్నట్లుండి ఒక రోజు. ఎందుకు అంటే "ఉద్యోగానికి పెట్టుబడి" అన్నాడు. "ఇంక తిరిగి రానిది" అని కూడా అన్నాడు తనే. ఎక్కడ్నుంచి తేగలను అంత డబ్బు? లక్ష్మి పెళ్ళికి చేసిన అప్పు ఇంకా కొంత మిగిలే ఉంది. నాకు పొలం అంటూ ఏమీ లేదు కానీ, రాజ్యానికి పుట్టింటి వాళ్ళిచ్చిన ఎకరం పొలం ఉంది. అది అమ్మడానికి బలవంతాన ఒప్పుకుంది రాజ్యం. కానీ బేరం కుదరాలి కదా. వీడికా డబ్బు వెంటనే కావాలని కూర్చున్నాడు. ఏదో మాటల సందర్భంలో ఈ మాటే అన్నాను సుబ్బారాయుడితో. "నేను ఇస్తాను లేరా" అన్నాడు తేలికగా. నేను ఆశ్చర్యంలో నుండి తేరుకోనే లేదు — "రమ్యకు సంబంధం ఇంకా కుదరలేదు కదా. అప్పటికి ఇచ్చేస్తావు కదా" అన్నాడు తనే. "సరే! రేపు తీసుకుంటాను" అన్నాను. "రేపు బ్యాంకు శలవు. ఈ రోజే ఇస్తాను" అన్నాడు. డబ్బు అయితే తీసుకున్నాను కానీ ప్రాంసరీ నోటు వ్రాయించుకోడానికి వాడు ససేమిరా ఒప్పుకోలేదు. ఏమయితేనేం? బలవంతాన ఒప్పించాను. కానీ నోటు వ్రాయడం రేపటికి వాయిదా పడింది — రెవిన్యూ స్టాంపుల కోసం.

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) కథల పోటీలో
సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

ఆ రేపే ఉదయం లేస్తూనే పిడుగులాంటి వార్త– సుబ్బారాయుడికి రాత్రికి రాత్రి "పెరాలిసిస్ స్ట్రోక్" వచ్చిందనీ, కుడి చెయ్యి, కుడి కాలు కదలని స్థితిలో మంచం మీద పడి ఉన్నాడు హాస్పిటల్లో. మాట కూడా స్పష్టంగా రావడం లేదు. కూతుళ్ళు ఇద్దరూ చెరో పక్కా ఉన్నారు ఏడ్చి ఏడ్చి అలసిపోయి. నన్ను చూడగానే కన్నీరు పెట్టుకున్నాడు. ఆడపిల్లల్ని చూపించి ఏదో సైగ చేస్తున్నాడు. వాడి బాధ నాకు అర్థమయింది. వెంటనే "పిల్లల విషయం నీవేమీ దిగులు పెట్టుకోవద్దు" అని చెప్పాను. "త్వరలో నయమవుతుందని" ఓదార్చాను. "నా కూతురితో సమానం వాళ్ళిద్దరూ. నీకేమీ భయం లేదులే!" అని ధైర్యం చెప్పాను.

రోజూ చూసి వస్తూనే ఉన్నాను. వారం రోజులకు కొంచెం కోలుకున్నాడు. రేపు డిశ్చార్జి చేస్తారు - అనగా ఆ ముందు రాత్రి తిరిగి పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చి బి.పి. కూడా రైజ్ అవడం వల్ల సుబ్బారాయుడు పోయాడు అనే వార్త రాత్రికి రాత్రి నన్ను చేరింది. రాజ్యం, నేను చాలా బాధపడి, జరగవలసినవన్నీ దగ్గరుండి జరిపించాము.

అప్పుడే సుబ్బారాయుడు పోయి 6 నెలలు అయింది. నా చిన్న కొడుకు రవీంద్ర ఉద్యోగంలో చేరి కూడా 6 నెలలే అయింది. సుబ్బారాయుడి పెద్ద కూతురు రమ్య ప్రైవేట్లు చెబుతూ ఇల్లు గడుపుకొస్తుంటే, చిన్నకూతురు దివ్య మాత్రం బియ్యేలో చేరింది. నేను వీలు చిక్కినపుడల్లా పరామర్శించి వస్తూనే వున్నాను.

కానీ, రాజ్యం మాత్రం తన పొలం అమ్మనని మొండికేసింది. అవసరానికి వాడుకొని స్నేహితుడిని మోసం చేశానేమో అన్న అంతర్మథనం నాలో మొదలయింది. కానీ ఏం చేయగలను? రాజ్యం ముందు నేను పూర్తిగా అశక్తుడ్ని. తీర్చడానికి వేరే మార్గం కూడా లేదు ప్రస్తుతం.

"ఆడపిల్లల గురించేరా నా బాధ! ఉద్ధరిస్తాడనుకున్న వాడు బాధ్యతల నుంచి తప్పుకున్నాడా? అదృష్టవంతురాలు అది. ఏమీ చూడకుండానే వెళ్ళిపోయింది. ఈ రెండు పెళ్ళిళ్ళూ అయిపోతే నాకు నిశ్చింత" — సుబ్బారాయుడి మాటలు పదే పదే నా చెవుల్లో మారు మోగుతున్నాయి. కానీ నేనేం చేయగలను?

మరో 6 నెలల తర్వాత ఆ రోజు, నిజంగా సుదినమే — పొద్దున్నే పేపర్ కోసం తలుపు తీసిన నా ఎదురుగా కొత్త పెళ్ళికొడుకూ, కొత్త పెళ్ళికూతురూ. ఎవరో కాదు. రవీంద్ర, రమ్య. మెరిసిపోతున్నారు ఇద్దరూ. (ఎప్పుడొచ్చిందో రాజ్యం నా వెనుక నోట మాట రాక నిలబడిపోయింది). మెడలో దండలతో సహా వచ్చేశారు.

"నాన్నా! మీకు కావలసిన కులం, కట్నం కానుకలూ రమ్యలో లేకపోయినా, నాకు కావలసిన విద్య, వినయం, అంతకు మించి నన్ను ప్రేమించగల హృదయం ఉన్నాయి. మీరెటూ ఒప్పుకోరని మేము రాత్రి గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం. ఈనాడు నేను ఈ స్థితిలో ఉన్నానంటే అది ఎవరి చలవో నాకు తెలుసు నాన్నా.

" ... అంటూ లోనికి నడిచాడు.

చెప్పడం నాకే అయినా వాళ్ళమ్మను చూస్తూనే అన్నాడు ఈ మాటలు.

పాపం! రాజ్యం ఈ పరిస్థితిలో కన్నకొడుకును వదులుకుంటుందా? లేక, కోడల్ని స్వీకరిస్తుందా? నేను మాత్రం మౌనం వహించాను. సుబ్బారాయుడి మొహం మాత్రం నాకు నవ్వుతూ కనిపిస్తుంది ఇపుడు.

"కానీ, ఆ ముప్ఫయి వేల గురించి రవీంద్ర కెలా తెలిసింది? రాజ్యం, నేనూ వాదులాడుకోవడం వీడు వినేశాడా?


ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక

తెలుగు కళాసమితి, న్యూజెర్సీ
సంయుక్త ఆధ్వర్యంలో
ఉగాదికి
చిన్న కథలు–వ్యంగ్య చిత్రాల పోటీ
5,400 రూపాయల బహుమతులు

క్రిందటి సంవత్సరం నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా అమెరికాలోని తెలుగు వారు ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక ద్వారా చిన్న కథ, కార్టూన్ విభాగాల్లో పోటీలు నిర్వహించతలపెట్టారు.

కథలు
ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కథలకు వరుసగా రు. 1000, రు. 700, రు. 400 బహుమతులుగా వుంటాయి. ఇవి కాక ఒక్కో కథకు రు. 300 బహుమతి చొప్పున ఆరు కథలను, రు. 150 బహుమతి చొప్పున ఆరు కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేస్తాము.

నిబంధనలు
* తెలుగువారి జీవిత చిత్రణ లక్ష్యంగా మీరు పంపే కథలు అమెరికాలోని ఆంధ్రులకు అర్థమయ్యేలా సులభ శైలిలో, సరళమైన భాషలో వుండాలి.
* వ్రాతలో కథ మూడున్నర అర తావులు వుండాలి.
* అనువాద కథలు, అనుకరిస్తూ చేసిన రచనలు స్వీకరించడం జరుగదు కనుక - రచయితలు తమ రచన(లు) అనువాదం, అనుసరణ కావని స్పష్టంగా పేర్కొంటూ హామీ పత్రాన్ని జతపరచాలి.
* ఒకరు ఎన్ని రచనలైనా పంపవచ్చు.
* కలం పేరు అచ్చులో వినియోగించేందుకు మాత్రమే పరిమితం. రచనలో పాటు పూర్తి చిరునామా విధిగా వుండాలి.
* ప్రచురణకు అంగీకరించని రచనలను తిప్పి పంపడం సాధ్యపడదు కనుక, స్టాంపులు అంటించిన కవర్లు జత వెయ్యనవసరం లేదు.
* బహుమతి రచనల గురించి, సాధారణ ప్రచురణల గురించి తుది నిర్ణయం సంపాదక వర్గానిదే.
* బహుమతి పొందిన కథలు, సాధారణ ప్రచురణకు ఎంపిన కథలు ముందుగా ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో అచ్చయి, ఆ తరువాత న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి మాస పత్రిక 'తెలుగు జ్యోతి'లో నెలకొకటి చొప్పున ప్రచురితమౌతాయి. కార్టూన్ల ప్రచురణకు కూడా యిదే పద్ధతిని అనుసరిస్తాము.
* ఎంపికైన రచనలకూ, బహుమతి కథలకూ, బహుమతి పొందిన కార్టూన్లకూ పారితోషికం అందజేస్తున్నది న్యూజెర్సీ తెలుగు కళాసమితి.

కార్టూన్ విభాగం
* 'క్యాప్షన్' లేని కార్టూన్లకు ప్రాధాన్యత వుంటుంది.
* ఒక్కో కార్టూన్‌కు రు. 75 బహుమతి చొప్పున ఈ పోటీలో మొత్తం 8 కార్టూన్లను ఎంపిక చేస్తాము.

కథలు కార్టూన్లకు గడువు తేదీ: ఫిబ్రవరి 28

—ఎడిటర్

చిరునామా: తెలుగు కళాసమితి, న్యూజెర్సీ వారి కథల పోటీ,
ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, పోస్ట్ బాక్స్ నెం. 712,
లబ్బీపేట, విజయవాడ-520 010.